సింగిల్ పేజీ కథ

# నీ చారలకో దండం

డా॥ ఎం. హరికిషన్

ఒక అడవిలో ఒక ఎలుగుబంటి వుండేది. అది చానా మొండిది. ఎవరెన్ని మంచిమాటలు చెప్పినా కొంచంగూడా చెవికి ఎక్కించుకునేది కాదు. తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళు అనే రకం.



ఒకసారి ఆ ఎలుగుబంటి నీళ్ళు తాగుతా చెరువులోనికి చూసుకొనింది. తన ఒళ్ళంతా నల్లగా, బొచ్చుతో వుండడం చూసి "ఛ...ఛ... ఈ రూపం ఏమీ బాగాలేదు. ఎవరైనా చూడగానే "అబ్బ! ఎంత ముచ్చటగుంది ఎలుగుబంటి' అనేలా తయారుకావాలి అనుకొనింది.

ఆ ఎలుగుబంటికి ఒక చెట్టుకింద ఒక ఉడుత చెంగు చెంగున ఎగురుతా ఆడుకుంటా కనబడింది. అది వీపు మీద మూడు చారలతో ముచ్చటగా ముద్దుముద్దుగా వుంది. వెంటనే ఎలుగుబంటి దాని దగ్గరకు పోయి "ఉడుతా... ఉడుతా... నీ వీపు మీద ఆ అందమైన చారలు భలేగున్నాయి. ఎవరి దగ్గర వేపిచ్చుకున్నావు" అని అడిగింది.

దానికి ఉడుత నవ్వి "ఎలుగు మామా! ఈ లోకంలో ఒక్కొక్క జీవి ఒక్కొక్క రకంగా వుంటాది. నేనీ చారలు ఎక్కడా వేపించుకోలేదు. అవి పుట్టుకతోనే వచ్చాయి. జింకకు మచ్చలు, నెమలికి పింఛము, ఏనుగుకు తొండము, నాకు చారలు అలా వచ్చినవే" అని చెప్పింది. కానీ ఎలుగుబంటి దాని మాటలు నమ్మలేదు. కోపంగా దాని తోక పట్టుకొని గాలిలో వేలాడదీసి "మర్యాదగా నిజం చెబుతావా... లేక ఇలాగే బండకేసి బాది చంపమంటావా" అని మూతిమీద గట్టిగా ఒక్కటి పెరికింది.

ఉడుతకు చాలా కోపమొచ్చింది. "దీనికి మంచిగా చెబితే ఏదీ ఎక్కదు. ఇంకోసారి నా జోలికి రాకుండా ఏదో ఒకటి చేయాలి" అనుకొని "ఎలుగుమామా... పొరపాటయింది. నన్ను వదిలెయ్యి. నిజం చెబుతా. ఇదిగో ఈ అడవి పక్కనే అదిగో అక్కడ దూరంగా కనబడుతోందే... ఆ వూరిలో రంగయ్య అని ఒక కమ్మరాయన వుంటాడు. ఆయనే నాకీ చారలు పెట్టినాడు" అని చెప్పింది.

"అదీ సంగతి. అలా చెప్పు. తంతేతప్ప ఎవడూ నిజం చెప్పడు ఈ లోకంలో" అంటూ ఎలుగుబంటి పక్కనే వున్న పూరి లోనికి పోయింది.

అక్కడ ఒకచోట కమ్మరి రంగయ్య కొలిమి దగ్గర ఏదో పని చేసుకుంటా కనబన్నాడు. ఎలుగుబంటి ఆయన దగ్గరికి పోయి "అనా... అనా... నాక్కూడా ఉడుతకు పెట్టినట్టే వీపు మీద అందంగా మూడు చారలు పెట్టవా" అనడిగింది. దానికి వాడు పకపక నవ్వి "ఓసీ పిచ్చి దానా... ఈ లోకంలో దేని అందం దానిదే. ఒకదానిని చూసి ఇంకొకటి అసూయపడగూడదు. ఐనా నేను ఆ ఉడుతకు ఏ చారలూ పెట్టలేదే" అన్నాడు. కానీ ఎలుగుబంటి వాని మాటలు కొంచంగూడా చెవికి ఎక్కించుకోలేదు. ఉలుక్కున వాని గొంతు పట్టుకొని "ఏరా... మర్యాదగా అడుగుతావుంటే తెగ నీలుగుతున్నావు. చారలు పెడతావా లేక ఇలాగే గొంతు పిసికి ఇక్కన్నే బూంచమంటావా" అని బెదిరిచ్చింది.

దాంతో వాడు "అబద్ధానికున్న విలువ నిజానికి లేదీలోకంలో" అని గొణుక్కొని "సరే పెడతా... కానీ చానా నొప్పిగా వుంటాది. తట్టుకోగలవా" అనడిగినాడు. దానికి ఎలుగుబంటి నవ్వుతా "నా గురించి నీకు తెలీదు. ఆకాశమే విరిగి మీద పన్నా నాకేమీ కాదు. ఐనా ఆ ఉడుతే భరించగా లేనిది నేను భరించలేనా... పెట్టు" అనింది.

రంగయ్య సరే అని బాగా ఎర్రగా కాలిన ఇనుపచువ్వ ఒకటి తీసుకొని దాని వీపు మీద పెట్టి గట్టిగా ఒక్క అదుము అదిమినాడు. అంతే... వీపంతా కిందికీ మీదికీ ఒక్కసారిగా సుర్రుమనింది. అంతే. అది ఆ నొప్పికి తట్టుకోలేక కిందా మీదా పడి లబలబలాడుతా "ఓరి నాయనోయ్.. నొప్పంటే ఏదో మామూలుగా వుంటుందనుకున్నాగానీ ఒక్కదానికే దేవుడు కనబడతా వున్నాడు. ఇంక మూడుగాని పెట్టిచ్చుకున్నానంటే అంతే... సక్కగా ఆ దేవుని దగ్గరికే పోయేటట్టు వున్నాను" అనుకొనింది.

అంతలో రంగయ్య "ఏం ఎలుగుమామా... సిద్ధమేనా... రెండోది పెడతాను" అన్నాడు. వెంటనే ఎలుగుబంటి అదిరిపడి "నాయనోయ్... నొప్పంటే ఏమో అనుకుంటిగానీ మరీ ఇంత నొప్పా...ఈ చారలూ వద్దూ... ఆ అందమూ వద్దు. నీకూ నీ ఇనుపకడ్డీకి ఒక దండం" అంటూ అక్కన్నించి అడవిలోనికి పారిపోయింది.

# నిజంగా నిజం!

(7వ పేజీ తరువాయి)

ఆఫీసులో తను అసలు పని చేసాడో లేదో అన్నట్లు సమయం విచిత్రంగా గడిచి సాయంత్రం అయింది.

తన వైపే వస్తున్న మాయని చూసి నిలబడిపోయాడు ప్రసాదు. ఆమె సాధారణంగా ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడదు, దర్జా దర్పం కనబరుస్తుంటుంది, తన స్టేటస్‌కి తగినవాళ్ళెవరూ ఆ ఆఫీసులో లేరని ఆమె ఉద్దేశ్యం, అదృష్టం కలిసిరాక అక్కడ పని చేస్తున్నట్లు ఆమె ఫీలవడం అందరికీ తెలుసు. అలాంటి మాయ నడుచుకుంటూ తన దగ్గరకు వస్తున్నది.

"ప్రసాదుగారూ! ఇవాళ ఐమాక్స్‌లో సినిమా చూద్దామని రెండు టికెట్లు తెప్పించాను, ఇప్పుడు నా స్నేహితురాలు రావడం లేదు, ఎందుకనో మిమ్మల్ని పిలవాలనిపించింది, నాతో సినిమాకు వస్తారా? అడిగింది.

ప్రసాదుకి ఏదో భూకంపం వచ్చినంత వైబ్రేషన్, చెమటలు పట్టి కళ్ళు గిరగిర తిరిగి నోటమాట రాక తడారిపోయింది. విగ్రహంలా నిలుక్కుపోయాడు.

"ప్రసాదుగారూ! ఇంతకి వస్తున్నారా లేదా?" అంటూ మళ్ళీ అడిగింది. అతని ప్రమేయం లేకుండానే తల "సరే" అని అదే ఊపేసుకుంది. తేరుకోవడానికి అతనికి కాస్త సమయం పట్టింది.

వెనుక సీటులో మాయని కూర్చోబెట్టుకొని ఆమె స్కూటీని నడుపుతున్న ప్రసాదుకు పాత పౌరాణిక సినిమాల్లో నాయకీ నాయకుల్లా పాడుకుంటూ మబ్బుల్లో విహరిస్తున్నట్లుగా ఉంది, అక్కడక్కడా ట్రాఫిక్ జామ్ అవుతున్నా కూడా అతనికి తెలియదం లేదు, ముసిముసి నవ్వులతో బండి నడుపుతున్నాడు.

***

మాయతో రెండున్నర గంటలపాటు సినిమా చూడటం ఆ తరువాత రెస్టారెంట్‌లో అరగంట కూర్చోవటం ఎంతో థ్రిల్లింగా ఉంది, కలో నిజమో అర్థంకాని పరిస్థితి. మరొకసారి చేతిమీద గిచ్చుకున్నాడు. కల కాదు నిజమే! ఇంటికి చేరేసరికి రాత్రి పది గంటలయింది. ఆలస్యం అయితే సత్యశ్రీ మండిపడటం సాధారణం. కానీ ఆ రోజు "ఏమిటండి ఆలస్యం అయింది ఆఫీసులో పని ఎక్కువైయిందా?", త్వరగా ఫ్రెష్ అయి రండి భోజనం వడ్డిస్తాను" అన్నది.

"సారీ సత్యా! ఇవాళ నా కొలీగ్ ఒకరు పార్టీ ఇస్తేను అక్కడే తినాల్సి వచ్చింది అన్నాడు కాస్త బెదురుతూ. మామూలుగా



అయితే ఇలాంటి సమయంలో "ఇప్పుడు వండింది ఏం చెయ్యమంటారు? స్నేహితులు కనబడితే ఇల్లు వాకిలి గుర్తు రావా? ఒక ఫోను చేసి చెప్పాలనే ఆలోచన కూడా రాదా?" అనే మాటలు వినపడేవి. కానీ అందుకు విరుద్ధంగా "అలాగా! పోనీలెండి! రేపు ఉదయం పనమ్మాయికి పెట్టేస్తాలే! మీరెళ్ళి పడుకోండి" అన్న మృదువైన పలుకులు వినపడ్డాయి.తన బెడ్‌రూంవైపు పోతూ మరొకసారి గిచ్చుకున్నాడు ప్రసాదు.

చిన్నగా మంచం మీద వాలిన ప్రసాదు "ఏమిటి? ఇవాళ ఇంత మధురంగా గడిచింది? ఎటు అడుగువేస్తే అటు ఆనందాశ్చర్యాలు వెంటాడాయి. రోజూ ఇలానే ఉంటే బావుండు" అనుకుంటున్న సమయంలో సత్యశ్రీ వచ్చి ప్రక్కన కూర్చుంది.

ఆ రోజు ఆమె చూపుల్లో ఎప్పుడూ లేనంత ఆకర్షణ! ప్రక్కనే ఉన్న రేడియో ఆన్ చేసాడు. "ఎంత హాయి ఈ రేయి ఎంత మధురమీ హాయి" పాట వస్తున్నది. చివరికి రేడియో కూడా తనకు అనుకూలంగా మారిపోయిందనుకుని మురిసిపోయాడు. ఎప్పుడూ లేనంత దర్జా కనబరుస్తూ కొంటెచూపులతో గుచ్చుతున్నట్లు భార్యని చూస్తూ ఆమె చెయ్యందుకున్నాడు.

తెల్లవారినా ఇంకా నిద్ర లేవని ప్రసాదు ముఖం మీద ఏదో చల్లగా పడుతున్నది. కళ్ళు తెరిచి చూసి అవాక్కయిపోయాడు. ఎదురుగా ఎవరీ దేవకన్య? కాదు తన మరదలు స్వప్న. "అమెరికా వెళ్ళి ఎంత అందంగా తయారయ్యింది?" తనలో తాను అనుకుంటున్నాడు.

"ఏమిటి బావా! తెల్లవారుఝామున వచ్చా, ఎప్పుడెప్పుడు నిద్ర లేస్తావా అని ఎదురుచూస్తున్నా, నీ కోసం ఏమి తెచ్చానో చూడు" అంటూ తను తెచ్చిన ఫ్రెంచ్ పెర్ఫ్యూమ్‌ని అతనిపై స్ప్రే చేస్తున్నది. ఆ పరిమళానికి మరింత మైమరచిపోతున్నాడు ప్రసాదు. "ఈ రోజు మరీ ఉల్లాసభరితంగా ప్రారంభం అయిందన్నమాట" అనుకుంటున్నాడు. ఆమె స్ప్రే చేస్తూనే ఉంది. "వద్దు ప్లీజ్! వద్దు! ఇక చాలు!" అని ముఖానికి చెయ్యి అడ్డం పెట్టుకున్నాడు.

కానీ ఈ సారి చేతుల మీద ఇంకాస్త ఎక్కువ మోతాదులో చల్లగా ఏదో పడుతున్నది. కళ్ళు తెరిచి తల విదిలించుకొని చూసుకున్నాడు. పెర్ఫ్యూమ్ కాదు నీళ్ళు, తల ఇంకా బాగా విదిలించి చూసాడు. ఎదురుగా ఉన్నది మరదలు స్వప్న కాదు, భార్య సత్యశ్రీ, కళ్ళలో చిరాకు చేతిలో నీళ్ళ గ్లాసు. "ఇంత మొద్దు నిద్ర ఏమిటి? గంట ఏడయింది, లేచి త్వరగా వెళ్ళిరండి" అన్నది. ఆమె చేతిలో యథావిధిగా పాలకార్డు, సంచీ. ప్రసాదు తల గిరగిరా తిరిగింది. తమాయించుకొని అటూ ఇటూ చూసాడు. ఏమిటిది? కలా నిజమా? తనను తాను పరీక్షగా చూసుకున్నాడు, చెయ్యి మీద గిచ్చుకోవడానికి చూసాడు, కానీ అది అప్పటికే ఎర్రగా కందిపోయి ఉంది, "నిజమే! ఇది కలకాదు నిజం! మాయ, స్వప్న నిజం కాదు, సత్యశ్రీయే నిజంగా నిజం.

## రచయితలకు సూచనలు!

* మీ రచనలను కాగితాలకు ఒకవైపున మాత్రమే రాయాలి.
* జిరాక్స్ కాపీలను పరిశీలనకు స్వీకరించలేం.
* మీ రచనతోపాటు పూర్తి అడ్రసు రాయాలి. పిన్‌కోడ్ నెంబరు తప్పనిసరిగా ఉండాలి.
* అనువాద రచనలకి మూల రచయిత అనుమతి పత్రం జతచేయాలి.
* మీ రచన ఇదివరకు ఎప్పుడూ, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదన్న హామీపత్రం జతపరచాలి.
* ప్రచురించని రచనల్ని తిరిగి పొందాలనుకునేవారు తగినంత పోస్టేజీ స్టాంపులు అంటించిన సెల్ఫ్ అడ్రసు కవరు విధిగా జతపరచాలి.
* రచనల ప్రచురణకు సంబంధించి ఫోన్‌లో ఎలాంటి సంప్రదింపులకు తావులేదు.
* ఆరోగ్యకరమయిన హాస్య, వ్యంగ్య రచనలకి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది.
* మీ రచనలు పంపించవలసిన చిరునామా:

ఆదివారం వార్త
ఎడిటర్
'వార్త' తెలుగు దినపత్రిక
లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్ - 500 080